## ఇక్బాల్ ఆహేమద్‌ను పరామర్శించిన మాజీ మంత్రులు

**గద్వాల, అక్టోబర్ 23 ప్రభాతవార్త:**బీఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా వ్యవస్థాపక సభ్యులు, మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షులు, వక్ఫ్ కాంప్లెక్స్ మాజీ ఉపాధ్యక్షులు, ఇక్బాల్ అహ్మద్‌ను మాజీ మంత్రులు మహామూద్‌అలీ,శ్రీనివాస్‌గౌడ్‌లు బుధవారం పరామర్శించారు. గత రెండు రోజుల క్రితం ఇక్బాల్ అహ్మద్ తల్లి మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహాముద్ అలీలు ఇక్బాల్ తో పాటు వారి సోదరులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమనాయకులు,కాంగ్రెస్ నాయకులు,హనీఫ్‌అహమ్మద్,వాహేద్ తాజ్,జహంగీర్,రహీం,బిలాల్,ఆహేమద్‌నవాజ్,మనోహర్,మహముద్, రవికిషన్ రెడ్డి, పొన్నకల్ మహాముద్, నిజాముద్దీన్, అన్వర్, సిఖిందర్ పాల్గొన్నారు.



ఇక్బాల్ అహమద్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు

## డిస్ట్రిక్ట్ వక్ఫ్ ప్రొటెక్షన్ సెల్ సభ్యులు ఫసియోద్దిన్‌కు ఘన సన్మానం



డిస్ట్రిక్ట్ వక్ఫ్ ప్రొటెక్షన్ సెల్ సభ్యులు ఫసియోద్దిన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబరు 23 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ మరియు కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, అడ్వకేట్ సయ్యద్ ఫసియోద్దిన్‌ను కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హబీబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా హబీబ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని ఆయన అన్నారు. జిల్లా స్థాయి కమిటీలో ఫసియోద్దిన్‌కు సముచిత స్థానం కల్పించిన ప్రజా ప్రతినిధులు, అధికారులకు ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు హబీబ్ ఖాన్, సాధిక్ పాషా, కౌన్సిలర్ నిజాం, మహమ్మద్ గౌస్, షేక్ వాజీద్, ఇంతియాజ్, సలీం, ఫహీం, సుల్తాన్, అయ్యూబ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

## 29న పియూలో వర్క్‌షాప్

**బ్రోచర్‌ను విడుదల చేసిన చైర్మన్ డా.చంద్రకిరణ్ వెల్లడి**

**మహబూబ్‌నగర్,అక్టోబరు 23 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 29న గణిత శాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డా. చంద్రకిరణ్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బ్రోచర్ ఆవిష్కరించి, గణితశాస్త్రంలో నూతన పోకడల అంశంపై వ్యాస రచన ఉపన్యాసం ఇచ్చి పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.పియుపరిధిలో ఉన్న అనుబంధ కాలేజీ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డా.మధు, కో కన్వీనర్ విభాగాధిపతి డా.రవిందర్‌రెడ్డి,కో ఆర్డినేటర్స్ నాగరాజు, సురేష్, పిఆర్‌ఓ డా.రవికుమార్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపక బృందం

## వైద్యాధికారుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

**గద్వాల, అక్టోబరు 23 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా ఆసుపత్రి, సి.హెచ్.సి అలంపూర్ లలో వైద్యాధికారుల నియామకానికి వాక్- ఇన్ ఇంటర్వ్యూ నిర్వహి స్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఆసుపత్రి జోగులాంబ గద్వాల్, సి.హెచ్, సి అలంపూర్‌లో సిఎఎ స్ (ఎస్‌పిఎల్) మెడిసిన్ (3) సిఎ ఎస్ (ఎస్‌పిఎల్) జనరల్ సర్జన్ (2), సిఎఎస్ (ఎస్‌పిఎల్ ) గైనకో లోజిస్ట్ (4), సిఎఎస్ (ఎస్‌పిఎల్) అనస్థేషియా (2),అలంపూర్ లో జి.డి.యం.ఓ (2) పోస్టుల భర్తీ కోరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25 నుండి 26 వరకు రెండు రోజుల పాటు నిర్వహించబడే ఈ ఇంటర్వ్యూలో పాల్గొనవలసిందిగా కోరడమైనది. ఎంపిక ప్రక్రియ గద్వాల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ లో జరుగుతుందని తెలిపారు.

## గ్రామాలలో పెండింగులో ఉన్న పనులు పూర్తి చేయాలి

**అయిజ అక్టోబరు, 23 ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామపంచాయితీల్లో పెండింగులో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకటయ్య ఆయా శాఖ అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ ఆవరణలో గ్రామ పంచాయితీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త నర్సరీ నిర్వహణ, ఎల్ఆర్ఎస్, సీఎం కప్, వ్యక్తిగత మరుగుదొడ్లు మరియు గ్రామ పంచాయితీలలో నిర్వహించే అన్ని రకాల రిజిస్టర్లను అప్డేట్, అదే విధంగా జాబ్ కార్డులు కూడా అప్డేట్ చేసి రాబోయే సోషల్ ఆడిట్‌కు సిద్దంగా ఉంచవలెనని అందర్ని ఆదేశించడం జరిగింది. 2024-25 సంవత్సరానికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ లో చేయబోయే పనుల కొరకు ప్లానింగ్ చేయవలెనని అందరు ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఓ, ఎంపీఓ పాల్గొనడం జరిగింది.



గ్రామ పంచాయతీ తీర్మానించిన

## స్థలంలోనే హెల్త్ సెంటర్ నిర్మించాలి

**ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్థుల ధర్నా**

**గోపాల్‌పేట అక్టోబరు 23 ప్రభాతవార్త :** గోపాల్‌పేట మండలంలోని ఏదుట్ల గ్రామానికి మంజూరు అయిన హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి హెల్త్ డిపార్ట్‌మెంట్ ,తహశీల్దార్ స్థలం కేటాయింపు గురించి గతంలో గ్రామపంచాయతీని కోరగా బస్టాండ్ సమీపంలో ప్రభుత్వం ప్లాట్లు వేయగా మిగిలిన ప్రభుత్వ స్థలాన్ని భారత రాజ్యాంగ స్తూపం దగ్గర అందరికీ అనుకూలంగా ఉంటుందని తీర్మానం చేసి కేటాయించడం జరిగింది కానీ హెల్త్ సబ్ సెంటర్ కాంట్రాక్టర్ తీర్మానించిన స్థలంలో కాకుండా క్రీడా ప్రాంగణం కు చెందిన స్థలంలో నిర్మాణం మొదలు పెట్టడం జరిగింది. ప్రజలకు దూరంగా హెల్త్ సబ్ సెంటర్ నిర్మిస్తే వారికి అనుకూలంగా ఉండదని అట్టి స్థలం ముందర గ్రామానికి చెందిన స్మశాన వాటిక, ఉప్పర కమ్యూనిటీ స్మశాన వాటిక,ఊర చెరువు అలుగు అని ఉండడం వలన గ్రామస్తులు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు ,వృద్ధులు అందరూ ఇబ్బందులకు గురి అవుతారని ఈ విషయాన్ని ఏదుట్ల గ్రామస్తులు కాంట్రాక్టర్ కి తెలియజేసి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరారు.ఈ విషయమై బుధవారం రోజు గ్రామ ప్రజలు ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. దీనిపై అధికారులు స్పందించకపోతే కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి క్రాంతి రావు,ఎర్రోళ రాములు, దేవని విష్ణు,జంపుల ధర్మయ్య, బర్ల విష్ణు,జుట్టు మధు, సంకెన్ల ప్రవీణ్,అబ్బా రాజు, ప్రశాంత్, మాలయ్య, ఎదుట్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ఎదుట్ల గ్రామస్తులు

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం..

**ఉప్పునుంతల,అక్టోబరు 23 ప్రభాతవార్త :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని దేవదారికుంట తండాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఇటీవల సైబర్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని వాటిపట్ల ప్రజలు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థికంగా మోసగించడమే లక్ష్యంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. శాస్త్ర,సాంకేతిక అభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని అన్నారు. ప్రజల్లో మూఢనమ్మకాల పట్ల నెలకొన్న అపోహను తొలగించుటకు స్వయంగా ఏఎస్పి రోడ్డుపై పడేసిన కొబ్బరికాయ, నిమ్మకాయ రసాలను తాగి ప్రజలకు అవగాహన కల్పించారు.
మూఢనమ్మకాలకు బలి కావద్దని ఆయన కోరారు. గ్రామాలలో గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో సంచరించిన, నంబర్‌ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలపై జరిగే ఆకృత్యాల నివారణకు షీటీంలు అందుబాటులో ఉంటాయన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి



దేవదారికుంట తండాలో
మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్

**యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి**

**మూఢనమ్మకాలను నమ్మకూడదు**

**నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్**

వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఇవ్వవద్దని ఓటిపిలు ఎట్టి పరిస్థితుల్లో ఇతరులతో షేర్ చేయవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్‌కు బాధితులైతే సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తే తగిన కౌన్సిలింగ్ ఇస్తామని ఆయన వివరించారు. దుందుబి వాగు పరిసర ప్రాంతాలలో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న ట్రాక్టర్ల సమాచారాన్ని సేకరించామని, త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ పల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసానికి గురైతే 24 గంటల్లోపు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అదనపు సహాయం కోసం 1930 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట డివిజన్ పోలీస్ అధికారి పల్లె శ్రీనివాసులు, అచ్చంపేట సిఐ రవిందర్, అచ్చంపేట ఎక్సైజ్‌శాఖ సిఐ సుబ్రమణ్యం, అమ్రాబాద్ సిఐ శంకర్, ఎస్సైలు వెంకట్‌రెడ్డి, పవన్‌కుమార్, రమేష్, కావలిబాబు, దూమర్ల ఇందిర పాల్గొన్నారు.

# పీసీసీని కలిసిన వ్యవసాయ కమిషన్ మెంబర్

**వంగూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త:**వ్యవసాయ కమిషన్ మెంబర్‌గా ఎన్నికైన కేవీఎన్‌రెడ్డి మొదటిసారిగా తన సహచరుడు పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌గౌడ్‌ను వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ పాండురంగారెడ్డితో కలిసి పీసీసీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పీసీసీ కేవీఎన్‌రెడ్డికి హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ ఎన్నో పోరాటాలను నిర్వహించి ప్రజల శ్రేయస్సు కోసమే నిరంతరం కృషి చేసిన కేవీఎన్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ రావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థుల కోసం ఉద్యమాలను నిర్వహించి రాష్ట్ర పీసీసీ సభ్యులుగా పనిచేస్తూ రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిలో రాణిస్తూ పార్టీ బలోపేతానికి సంబంధిత ఎమ్మెల్యేల గెలుపు కోసం కృషి చేసిన రైతు బిడ్డకు వ్యవసాయ కమిషన్ మెంబర్ రావడంతో రాష్ట్రంలోని రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆయన గుర్తు చేశారు. అనంతరం కేవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసమే నా పోరాటాలని, నేడు వ్యవసాయ కమిషన్ మెంబర్‌గా ఎన్నిక కావడం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతాంగానికి మంజూరయ్యే ప్రతి పథకాన్ని రైతుకు చేరే విధంగా చొరవ తీసుకొని రైతన్నకు వెన్నంటి ఉంటానని ఆయన పేర్కొన్నారు. రైతన్న సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో వ్యవసాయ కమిషన్ మెంబర్ కేవీఎన్‌రెడ్డి

## బస్సును ఓవర్‌టేక్ చేయబోయి

## టాటా ఏస్‌ను ఢీకొన్న కారు

**కృష్ణ, అక్టోబరు 23 ప్రభాతవార్త :** కృష్ణ మండలము, గుడెబల్లూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది (ఎన్‌హెచ్ 167) జాతీయ రహదారిపై హైదరాబాద్ నుండి రాయిచూర్ వెళ్తున్న కారు బస్సును ఓవర్‌టేక్ చేయబోయి టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ముళ్ళ పొదల్లోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికి ఎలాంటటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనపై కృష్ణా పోలీస్ శాఖ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టాటా ఏస్‌ను ఢీకొన్న కారు

## గోపాల్‌పేట ఎస్సైగా నరేష్ కుమార్

**గోపాల్‌పేట అక్టోబరు 23 ప్రభాతవార్త :** గోపాల్‌పేట మండల నూతన ఎస్సైగా నరేష్ కుమార్ బుధవారం రోజు బాధ్యతలు స్వీక రించారు. ఇక్కడ విధులు నిర్వహించిన హరి ప్రసాద్ వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకుంటామని, అలాగే యవకులు, ద్విచక్ర వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని,ట్రిపుల్ రైడింగ్ నియంత్రించాలని, అతి వేగంగా వాహనాలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని ఆయన అన్నారు.



బాధ్యతలు స్వీకరించిన నరేష్ కుమార్

# రుణమాఫీ కాని రైతుల వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తాం

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్**

**గద్వాల టౌన్,అక్టోబరు 23 ప్రభాతవార్త:** నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 25వ తేది శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ రెండు లక్షల రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వము రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని మభ్యపెడుతున్నా, వాస్తవానికి గ్రామాలలో కనీసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల లోపు ఇంతవరకు రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని, ఏవైతే చిన్న చిన్న కారణాలు చెబుతున్నారో బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి వాటిని పరిష్కారం చేసి రుణమాఫీ చేయాలని డిమాండు చేశారు. దసరా లోపు ఇస్తామన్న రైతు భరోసా ఊసే లేదని రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. గ్రామాలలో జిల్లా వ్యాప్తంగా రైతు రుణమాఫీ కాని రైతులు వారి భూమి పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ వివరాలను సేకరించి జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, పట్టణ నాయకులు గౌని శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి లవన్న, జిల్లా నాయకులు వెంకట్రాములు, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు నాయుడు, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు , మండల కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

## ఎమ్మెల్యే సహకారంతో ప్రమాద బాధితుడికి ఎల్‌ఓసి అందచేత

**పెబ్బేరు అక్టోబరు 23 ప్రభాతవార్త :** పెబ్బేరు మండల పరిధిలోని తోమలపల్లి గ్రామానికి చెందిన వారి కృష్ణకు ప్రమా దవశాత్తు యాక్సిడెంట్ అయి హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ అడ్మిట్ అవగా, అతని చికిత్స నిమిత్తం 1 లక్ష రూపాయలు ఎల్‌ఓసిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఇప్పించడం జరిగింది. ఎల్‌ఓసిని ప్రమాద బాధితుని సోదరు నికి, హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా యువన కాంగ్రెస్‌నాయకులు గంధం రంజిత్‌కుమార్, కార్యాలయ సిబ్బంది కెబి నాయుడు అందజేశారు.ఈ ఎల్‌ఓసికి సహకరించిన ఎమ్మెల్యే కి,గ్రామ మాజీసర్పంచ్ సురేందర్‌గౌడ్,డైరెక్టర్ రామన్ గౌడ్,రంగన్న యాదవ్,ఉమేష్ గౌడ్, రాము, శ్రీను,చంటి, శివకుమార్ కు కుటుంబ సభ్యుల ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

# మత్స్యకార ముదిరాజులను బీసీఏ గ్రూపులో చేర్చాలి

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి**

**పెబ్బేరు ముదిరాజ్ సంఘం డిమాండ్**

**పెబ్బేరు అక్టోబరు 23 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణ కేంద్రంలో ముదిరాజ్ కమిటీ హాల్ లో ప్రెస్ మీట్ నిర్వహించి సంఘం నాయకులు మాట్లాడుతూ మత్స్యకార ముదిరాజులను బిసిడి గ్రూపు నుండి బిసిఏ గ్రూపులోకి మార్చాలని మండల ముదిరాజ్ సంఘ నాయకులు బుధవారం విలేఖరుల సమావేశంలో డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో జిఓ నం.13 ముదిరాజులను బిసిడి గ్రూప్ నుండి బిసిఏ గ్రూప్ లోకి మార్చడం జరిగింది. కాని అనివార్య కారణాలవల్ల మళ్లి బిసిడి గ్రూపులోకి మార్చారన్నారు. అదేవిధంగా 2023 తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పార్టీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ముదిరాజులను బిసిడి గ్రూపు నుండి బిసిఏ గ్రూపులోకి మార్చుతానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవెర్చే విధంగా మత్స్యకార ముదిరాజులను బిసిడి నుండి బిసిఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బిసి గణన చేపట్టితే మత్స్యకార ముదిరాజు కులస్తులు మీ ఇంటి దగ్గర వచ్చిన సర్వే అధికారి వృత్తి పరంగా ఎ వృత్తి అని అడిగితే చేపలు పట్టడం వృత్తిగా చెప్పాలని తెలిపారు. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ వచ్చిన తర్వాత తెలంగాణ మొన్న జరిగిన డిఎస్ లో బిసి లకు అన్యాయం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార ముదిరాజ్ కులస్తులు గోనెల బాలస్వామి,చింతకాయల కురుమూర్తి,గోనెల సహదేవుడు, సోప్పరి బీచ్ పల్లి, మహేష్, ఎల్లయ్య, శ్రీనివాసులు, శాంతన్న, ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

## ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన వర్షాకు ఘన సన్మానం



సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**పెబ్బేరు అక్టోబరు 23 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన అడెం శారదమ్మ కొండల్ యాదవ్ ల కూతురు వర్షా ఎంబిబిఎస్ లో సీటు సాధించడంతో వారి స్వగృహానికి వెళ్లి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు వనం రాములు ఆధ్వర్యంలో పూలమాల శాలువాతో మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, పెద్దింటి వెంకటేష్, ఎద్దుల సాయినాథ్ , రాజశేఖర్ , వీరాస్వామి, వడ్డె రమేష్, మోగులన్న, మధు, యాదగిరి బిఆర్ఎస్ రాంపురం ముఖ్య నాయకులు సత్యారెడ్డి, మూర్తి నాగరాజు, బీచుపల్లి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఎంబిబిఎస్ పూర్తి చేసుకొని మంచి డాక్టరుగా ప్రజలకు సేవలు అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# బీఆర్ఎస్ పాలనలో ఉల్పర సబ్‌స్టేషన్ మంజూరు కాలేదు

**- నేటి ఎమ్మెల్యే వంశీకృష్ణ మంజూరు చేయించారు**

**- ఉల్పర గ్రామ ప్రజలు**

**వంగూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త:**2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలను మోసం చేసేందుకు మాయమాటలు చెప్పి ఉల్పర గ్రామానికి సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించానని హుటాహుటిన శిలాఫలకాన్ని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఏర్పాటు చేశారే తప్ప మంజూరు కాలేదని ఉల్పర గ్రామ ప్రజలు శ్యాంసుందర్‌రెడ్డి, పాండయ్య, ఈదన్న, శ్రీను, జంగయ్యగౌడ్‌లు పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఉల్పర గ్రామ పరిసర ప్రాంతంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ ఉన్నతాధికారులతో ప్రజల ముందే ఫోన్‌లో మాట్లాడి మంజూరు చేయించారని, త్వరలోనే సబ్‌స్టేషన్ నిర్మాణానికి పనులను ప్రారం భించడం జరుగు తుందన్నారు. మాయమాటలతో 10 సంవత్సరాలు ప్రజలను మోసం చేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజూరైన సబ్‌స్టేషన్‌ను కూడా మా పాలనలోనే మంజూరైనట్లు కొన్ని పత్రికల ద్వారా ప్రచురణ చేయించుకోవడం విడ్డూరకరమని వారు పేర్కొన్నారు.



సబ్‌స్టేషన్ మంజూరు కాక ముందే మాజీ ఎమ్మెల్యే పేరిట ఏర్పాటు చేసిన శిలఫలకం



మీడియాతో మాట్లాడుతున్న ఉల్పర గ్రామ ప్రజలు

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**ఖిల్లాఘణపురం అక్టోబరు 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెంకటం పల్లి గ్రామానికి చెందిన మొల్ల నారమ్మ కుమారుడు అయిన లక్ష్మణ్ 32 సంవత్సరాలు మతి స్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఈ నెల 1 వ తేదీన వెంకటం పల్లి గ్రామంలోని శివాని చుక్కన్న పాత ఇంటి పైకి ఎక్కి క్రిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి చికిత్స నిమిత్తం మాహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. మెరుగైన చికిత్సల కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా బుధవారం ఉదయం ఐదు గంటలకు మృతి చెందినట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు. తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం గొప్పవరం

### నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబరు 23 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం గొప్ప వరమని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. పేదింటి ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను రూపుమాపేందుకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాలతో ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన లబ్దిదారులకు మంజూరైన షాది ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నగా, మేనమామగా కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం చెక్కులను వారి కుటుంబాలకు అందించి అండగా నిలుస్తున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం పార్టీలకతీతంగా అర్హులైన లబ్దిదారులకు న్యాయం జరిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, జెఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు జమ్ముల సతీష్‌రెడ్డి, కొండ నాగేష్ తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో వివిధ యూనివర్సిటీల ఉపకులపతుల భేటీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు ఉప కులపతులను నియమించింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో వివిధ యూనివర్సిటీల ఉప కులపతులు భేటీ అయ్యారు. ఈ సమావేశానికి పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జిఎన్ శ్రీనివాస్ హాజరై గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ నూతనంగా నియమించబడ్డ ఉపకులపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, గత ప్రభుత్వంలో పని చేసిన విసిలకు, ఈ ప్రభుత్వంలో నియమించిన విసిలకు పనిచేసే విధానంలో తేడా చూపాలని, నాణ్యమైన విద్యను అందించాలని, విసిలు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ యూనివర్సిటీలను ప్రగతి పథాన నిలపాలని త్వరలో అన్ని విశ్వవిద్యాలయాల ఉప కులపతులతో మరోసారి భేటీ అవుతానని అన్నారు.



గవర్నర్‌తో ఫొటో సెషన్‌లో టియు విసి శ్రీనివాస్

## మహాసభలను విజయవంతం చేద్దాం

**ఉట్కూర్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** ఈనెల 27న జరిగే టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేద్దామని జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి కోరారు. బుధవారం మండల అధ్యక్షుడు విఠోబ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రథమ మహాసభలకు ముఖ్య అతిథిగా ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపిడికె అరుణ, నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు డా.పర్ణికరెడ్డి, వాకిటి శ్రీహరి, టియుడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి మధుగౌడ్ హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, మధు, ప్రతాప్‌రెడ్డి, అశోక్, వెంకట్‌రాములు, చంద్రప్రకాష్, అశ్వక్, మంజూర్ అహ్మద్, శంకర్‌రెడ్డి, భగవంతురెడ్డి తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి

## కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి జి. వెంకట్రాంరెడ్డి

**ఉట్కూర్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం దగ్గర సిపిఎం నాయకులు నిరసన తెలుపుతూ వర్షాకాలంలో అధిక వర్షాలతో వేసిన పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోవడం జరిగింది. వేసిన పత్తి పంట పెట్టుబడులు కూడా రాని దుస్థితి ఏర్పడిందని తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహసిల్దార్ రవికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో అధిక వర్షాలతో వేసిన పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోవడం జరిగిందని వేసిన ప్రతి పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొంది. దీనికి తోడు పండిన పంటను ప్రైవేటు వారికి అమ్మడంతో రూ. 2 వేల నుండి రూ. 3 వేల వరకు రైతాంగం నష్టపోతున్నారు. ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఇప్పటికే పత్తి చేతికొచ్చి రైతాంగం అమ్మకానికి సిద్ధంగా ఉన్న కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు గోవిందరాజ్, సిఐటియు మండల కన్వీనర్ నారాయణ, రైతు సంఘం నాయకులు వెంకటేష్ రైతులు పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## రైతు అవగాహన సదస్సుకు పెద్ద ఎత్తున రైతులను తరలించాలి

### అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

**గద్వాల, అక్టోబరు 23 ప్రభాతవార్త :** ఈనెల 26 న నిర్వహించే రైతు అవగాహన సదస్సుకు సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున రైతులను తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి నారాయణ ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో రైతు అవగాహన సదస్సు ఏర్పాట్ల పై పంచాయతీ, వ్యవసాయ, హార్టికల్చర్, డి.ఆర్.డి.ఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26న రైతు అవగాహన సదస్సును అధికారులు సమన్వయంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గద్వాల రైతు సదస్సు శనివారం 26వ తేది నాడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ గంజిలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రైతులను సదస్సుకు పెద్ద ఎత్తున తరలించేందుకు జిల్లా పంచాయితీ అధికారి, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, డిఆర్‌డిఓ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన ప్రత్యేకమైన స్టాళ్లు కూడా ఏర్పాటు చేయాలని, ఈ సదస్సులో ప్రధానంగా రైతులకు ఉద్యానవనంపై అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి శ్యామ్ సుందర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ భాష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ఏడీఏలు, ఏపీయం, డిపియం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## దేశంలో రిజర్వేషన్ కోట పెంచాలి..

**1931 జనాభా ప్రకారం 60 శాతం దాటని రిజర్వేషన్లు**

**ప్రస్తుత జనాభా ప్రకారం రిజర్వేషన్ కోట 80.20 కేటాయించాలి**

**కులగణన చేసి దామాషా ప్రకారం రిజర్వేషన్లు పంపిణీ చేయాలి**

**మాలల ఆత్మగౌరవ సభ తాలూకా కన్వీనర్ బిజ్జదేవదాస్**

**కొల్లాపూర్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** దేశంలో విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్ కోట జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఓసిలలో నిరుపేదలైన ఈడబ్ల్యుఎస్ కలుపుకుని రిజర్వేషన్ కోట 80శాతం ఉండాలని, జనరల్ ఓపెన్ కోటా 20శాతం ఉండే విధంగా రాజ్యాంగాన్ని సవరించాలని ఛలో నాగర్‌కర్నూల్ మాలల ఆత్మగౌరవ సభ కొల్లాపూర్ తాలూకా కన్వీనర్ బిజ్జ దేవదాస్ అన్నారు. చిన్నంబావి మండల కేంద్రంలో బుధవారం రాజ్యాంగ పరిరక్షణకై కొనసాగుతున్న ఉద్యమంలో భాగంగా హలో మాల, ఛలో నాగర్‌కర్నూల్ అంటూ మాలల ఆత్మగౌరవ సభ పేరుతో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని గోడపత్రికను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్వతంత్రానికి ముందు 1931 నాటి జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని నేటికి 93 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారని, ఇటీవల అగ్రవర్ణాల పేదలకు 2011 జనాభా ప్రకారం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, మరి మిగతా వర్గాలకు 1931 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కేటాయించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను క్రిమిలేరు పద్ధతిలో పంపిణీ చేయాలని సూచించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. దేశవ్యాప్తంగా రిజర్వేషన్లు 50:50 ఉండాలంటూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను ఎలా సమర్థిస్తుందని, దీంతో 60 శాతం అవుతుందని, దేశంలో అత్యధిక జనాభాకు వారి దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచి దేశవ్యాప్తంగా వివిధ వర్గాలకు కలిపి మొత్తం 80 శాతం రిజర్వేషన్, ఓపెన్ జనరల్‌లో 20 శాతం మాత్రమే ఉండే విదంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఈ విధానం ఆయా రాష్ట్రాలు ఉద్యోగ ప్రకటనలో లోకల్, నాన్ లోకల్ 80%:20% కొనసాగిస్తున్న ప్రకారమే దేశంలో రిజర్వేషన్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అణగారిన వర్గాలను విడదీసి రిజర్వేషన్లు రద్దుచేసే కుట్ర పన్నుతుందని ఆ కుట్రలో మందకృష్ణ మాదిగ లాంటి మందబుద్ధి గల వ్యక్తులు బలవుతున్నారని, ఇది మాదిగ జాతిని సైతం అంచనా వేయబడే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఉందని రాజ్యాంగానికి లోబడి తీర్పు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటరానితనాన్ని ఎదుర్కొంటున్న వర్గాలన్ని ఐక్యతగా కొనసాగాలని అందులో భాగంగానే ఎస్సీ ఉపకులాలు, ఎస్టీ ఉపకులాలు ఐక్యతగా కొనసాగి జనాభా దామాష ప్రకారం రిజర్వేషన్లు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆత్మగౌరవ సభ కో కన్వీనర్ మద్దెల రామదాసు, కర్నె విష్ణు, బిజ్జ సురెందర్, దాదిమల్ల శంకర్, జెట్టిశివ, తలారి వెంకటేశ్వర్లు, స్వాములయ్య, సుగ్రీవులు, నరహరి, అనాలదాస్ రాజేందర్, మోజర్ల రామేశ్వరరావు, నాగముని, కృష్ణయ్య, పూసలపాటి కురుమూర్తి, పెరుమాళ్ల వెంకటేష్, పెరుమాళ్ళ శ్రీనివాస్, మద్దిలేటి చెన్నయ్య, మధ్యల కృష్ణయ్య, జనార్ధన్, జెట్టి సూర్యనారాయణ, బాలరాజు, చందు, సందీప్, ఈశ్వరయ్య, ఎర్రశ్రీను, తిరుపతి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

## బాలికల ఖోఖో క్రీడల్లో క్రీడాకారులకు అభినందన

**మక్తల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి జూనియర్స్ బాలికల ఖోఖో క్రీడల్లో మక్తల్ మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు శశిరేఖ, శివాని పాల్గొని అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి 43వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలికల ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల జిహెచ్‌ఎం బి.వెంకటయ్యగౌడ్, పిడి బి.రూప తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వీరు ఈనెల 28 నుండి 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే 43వ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో శశిరేఖ, శివానిలతో పాటు అందుకు కృషి చేసిన పిడి బి.రూపను పాఠశాల జిహెచ్‌ఎం బి. వెంకటయ్యగౌడ్, ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఇటీవల మక్తల్ పట్టణంలో జరిగిన జిల్లాస్థాయి 10 కి.మీ. రోడ్డు స్పీడ్ సైక్లింగ్ పోటీలలో కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు మల్లేశ్వరి, హారిక, చైత్ర పాల్గొని ప్రథమస్థానం, ద్వితీయస్థానం పొంది మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ద్వారా మెడల్స్‌ను అందుకోవడం జరిగిందని పాఠశాల జిహెచ్‌ఎం బి. వెంకటయ్యగౌడ్, పిడి రూప తెలిపారు. వీరు నవంబర్ 4 నుండి 6 వరకు జనగాం జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్లప్ప, నరేష్, లక్ష్మీకాంత్, అశోక్‌గౌడ్, మీరా, తిరుమల, కృష్ణవేణి, పున్నమ్మ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

## సీడీసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం విజయవంతం చేయండి

**కొత్తకోట అక్టోబరు 23 ప్రభాతవార్త :** ఈ నెల 27 న జరగబోయే సీడీసీ చైర్మన్ ప్రమాణస్వీకారం విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్, పట్టణ కార్యదర్శి అధ్యక్షులు మేస్త్రి శ్రీను అన్నారు. బుధవారం కొత్తకోట మండల పార్టీ కార్యాలయంలో సమాఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్న వాళ్లకు న్యాయం చేస్తున్నదని అన్నారు. దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి పదవులు ఇవ్వడం ఆయన గొప్పతనం అనీ అన్నారు. అనంతరం ఈ నెల 27న బిపిఆర్ గార్డెన్ లో సిడిసి చైర్మన్ చంద్ర శేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు పదవులు అడగకముందే వస్తాయని అందుకు నిదర్శనం మార్కెట్ కమిటీ, సీడీసీచైర్మన్ అని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సీడీసీ చైర్మన్ గొల్లబాబు, కురుమూర్తి దేవస్థానం పాలక మండలి సభ్యులు బాదం వెంకటేశ్వర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, డబ్బ సలీం, శేఖర్ రెడ్డి, రాయిని పేట్ సురేందర్ రెడ్డి, మిషేక్ ,సుభాష్, శివరాములు, ముస్తఫా, సాయిలు యాదవ్, శివ యాదవ్, గోకరయ్య, శ్రీకాంత్ ,రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సీడీసీ చైర్మన్ ను సన్మానిస్తున్న నాయకులు

## బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత..

**వనపర్తి రూరల్ అక్టోబరు 23 ప్రభాతవార్త :** వనపర్తి మండలం కేంద్రంలోని సీవీ రామన్ జూనియర్ కళాశాలలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో లక్ష్మమ్మ డిసిపియు సోషల్ వర్కర్ మాట్లాడుతూ...బాల్య వివాహ చట్టం 2006 గురించి అవగాహన కల్పించడం వలన కలిగే అనర్థల గురించి వివరించడం జరిగింది. ఫోక్స్ ,చట్టం ద్వార బాలికలపై లైంగికంగా వేధింపులకు గురిచేసే వారికి 7నుండి 20 సంవత్సరాల వరకు గరిష్టంగా జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలపుతూ అదే విధంగా జిల్లాలో బాలికల నిష్పత్తి ఘననీయంగా తగ్గుతుంది ఆడపిల్లలను కాపాడుకోవడంలో భాగంగా అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని గర్భస్థ శిశువు నుండి 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిల కోసం నిరంతరాయంగా వారికి రక్షణగా చైల్డ్ హెల్ప్ లైన్ పనిచేస్తుందని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా బాలబాలికల హక్కుల కోసం అమలు చేస్తున్న పథకాలు పటిష్టమైన రక్షణ చట్టాలతో బాలల హక్కులను కాపాడుతూ వారి ఎదుగుదలకు ప్రోత్సాహం అందుతుందని అందుకు ప్రతి ఒక్కరు గర్వపడి మరింత ఉత్సాహంగా ఉన్నత లక్ష్యాలను చేదించే విధంగా ముందుకు సాగాలని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అమ్మాయిలకు మంచి స్పర్శ చెడు స్పర్శ పైపూర్తి అవగాహన కలిగి ఉండేలా అవగాహన కల్పించి ఇతరులచే ఏదైనా ప్రమాదం అని గ్రహిస్తే వెంటనే 1098 టోల్‌ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి సమాచారం ఇచ్చే విధంగా ప్రోత్సహించాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు, బాల్య వివాహాల నియంత్రణ కొరకై కృషిచేయాలని హాజరైన వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, జెండర్ స్పెషలిస్ట్ వాణి, భరోసా కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న డి.సి.పి.యు లక్ష్మమ్మ

## మున్సిపల్ చైర్మన్ బాబురెడ్డిని ఘనంగా సన్మానం చేసిన చైర్మన్

**గద్వాల, అక్టోబరు 23 ప్రభాతవార్త:** గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్ కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా లింగసూగురూ తాలూకాలో శంకరరెడ్డి కళ్యాణ మండపంలో మున్నూరు కాపు బలిజ సమాజం ఆధ్వర్యంలో లింగసూగూరూ తాలూకా నూతన మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మున్నూరు బాబురెడ్డికి గద్వాల చైర్మన్ కేశవ్, కౌన్సిలర్ లు ఘనంగా సన్మానం చేశారు. ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సన్మానం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయిచూరు మాజీ ఎమ్మెల్యే పాపిరెడ్డి, మున్నూరు కాపు బలిజ సమాజం అధ్యక్షులు నర్సా రెడ్డి, గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్ హజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ కేశవ్ నూతన మున్సిపల్ చైర్మన్ బాబురెడ్డి కి గజమాల వేసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లింగసూగురూ మున్సిపాలిటీ ని అభివృద్ధి చేసుకునేందుకు చైర్మన్ తో పాటు ప్రతి కౌన్సిలర్ సహకరించాలని తెలిపారు. అనంతరం నూతన మున్సిపల్ చైర్మన్ కి, కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శ్రీమన్నారాయణ మహేశ్, కాంగ్రెస్ పార్టీ గద్వాల టౌన్ అధ్యక్షులు ఇషాక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి.కోటేశ్ , రంజిత్, జనార్దన్ రెడ్డి, రాంచందర్ క్రాంతి, మధు, వడ్డే కృష్ణ, శివ, గోపాల్, చిన్నస్వామి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సన్మానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు

**వనపర్తి టౌన్ అక్టోబరు 23 ప్రభాతవార్త :** మండల సమాఖ్య నందు వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వికలాంగులకు, మహిళలకు, వరద బాధితులకు మూడు లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందని అదేవిధంగా త్వరితగతిన ఉచిత న్యాయ సహాయం పొందుటకు నల్స టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేసి పొందవచ్చు. ఆన్లైన్‌లో అప్లికేషన్ పెట్టి న్యాయ సహాయం పొందవచ్చు. మహిళా చట్టాలలో ముఖ్యమైనవి గృహహింస చట్టం మానసికంగా , శారీరకంగా, ఆర్థికంగా హింసించడం అవి శృతి మించినప్పుడు కోర్టును ఆశ్రయించవచ్చు, అక్కడ ఇరు కుటుంబీకులను పిలిపించి సమన్వయం చేసే అవకాశం ఉంటుంది. అలాగే అదనపు వరకట్నం నిషేధ చట్టం గురించి వివరించారు. ప్రతి గ్రామంలో ఆసక్తి గల అభ్యర్థుల నుంచి పారా లీగల్ వాలంటరీల ద్వారా దరఖాస్తు తీసుకోవడం జరిగింది. అదేవిధంగా అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శ్రీదేవి మాట్లాడుతూ వయోవృద్ధుల చట్టం గురించి వివరించారు. డి.కృష్ణయ్య వైస్ ప్రెసిడెంట్, సచకేంద్రం లీగల్ అడ్వైజర్ మాట్లాడుతూ మహిళలకు సచ కేంద్రం సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమములో ఏ.పి.ఎం వెంకన్న, చెన్నమ్మ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, శారదమ్మ కార్యదర్శి, సువర్ణ కమ్యూనిటీ కో ఆర్డినేటర్, అదాలత్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కలిగిస్తున్న జిల్లా న్యాయ సేవ అధికారి వి రజని



హాజరైన మహిళ సంఘాల సభ్యులు

### గెస్ట్ లెక్చరర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

## సదానందంగౌడ్‌కు ఘన సన్మానం



అయిళ్ల సదానందంగౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్

**కల్వకుర్తి, అక్టోబరు 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన అయిళ్ల సదానందంగౌడ్‌ను కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉన్నత విద్యావంతుడు, తెలంగాణ ఉద్యమ నేత, అధ్యాపకుల హక్కుల కోసం నిరంతరం పాటు పడే సదానందంగౌడ్‌ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం హర్షించదగ్గ విషయమని బృంగి ఆనంద్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. సన్మానించిన వారిలో రేష్మాబేగం, అస్మాబేగం, రాం పర్వతాలు, చెన్నకేశవులు, రాకేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## కొత్తకోటలో నార్కోటిక్ డ్రగ్స్ పరిశీలన



డ్రగ్స్ తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**కొత్తకోట అక్టోబరు 23 ప్రభాతవార్త :** డ్రగ్స్ నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కొత్తకోట పట్టణ కేంద్రంలో నార్కోటిక్ డ్రగ్స్ ని గుర్తించడానికి స్పెషల్‌గా ట్రైనింగ్ పొందిన డ్రగ్స్ తో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపారు. బిడి టీంతో కలిసి కొత్తకోట బస్టాండు ,భద్రప కాంప్లెక్స్, మదనాపురం రోడ్డు, మహేశ్వరి లాడ్జ్ బిల్డింగ్ (శివ పద్మ కాంప్లెక్స్) లో డ్రగ్స్ తో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, బిడి టీమ్ సిబ్బంది శ్రీనివాసులు ,శివ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్

## బకాయిలు విడుదల చేయాలి

### పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు





తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో పేదబడుగు బలహీన విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రియాంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌ల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ. 6350 కోట్ల బకాయిలను విడుదల చేయాలని పిడిఎస్‌యు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి పిడిఎస్‌యు నాయకులు శేఖర్ అధ్యక్షత వహించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. భాస్కర్, జిల్లా కార్యదర్శి సంధ్యలు పాల్గొని మాట్లాడారు. అనంతరం తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకులు అజయ్, చెన్నయ్య, విజయ్, గణేష్, రాకేష్, రాజశేఖర్, గణేష్, గోవింద్, సాయికుమార్, లింగప్ప, సంతోష్, నరెందర్ తదితరులు పాల్గొన్నారు.

